క్లుప్తంగా

ఆలయానికి రూ.లక్ష విరాళం


లక్ష్మణ్‌రావును సన్మానిస్తున్న నాయకులు

ములుగు రూరల్: మండల పరిధిలోని కాసిందేవ్‌పేటలో రామాలయ అభివృద్ధికి బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భూక్య అమర్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ రావు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. అనతరం లక్ష్మణ్ రావును ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. గ్రామంలోని దుగ్యాల సరేందర్ రావు, సంపత్ రావు, శ్రీనివాస్ రావు తల్లి మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, సీనియర్ నాయకుడు గండ్ర కోట సుధీర్, మాజీ ఎంపీపీ మురళి, మాజీ సర్పంచ్ పాలేపు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

బెల్ట్‌షాపుల తనిఖీ

ఏటూరునాగారం : మండలంలోని రొయ్యూర్ గ్రామంలో గల బెల్ట్ షాపులపై పోలీసులు దాడిచేసి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. ఎలక్షన్ కోడ్ అమల్లో భాగంగా అనుమతి లేకుండా మద్యం నిల్వలను గుర్తించేందుకు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం నిల్వ చేసే వారిపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు.

విద్యార్థులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న సభ్యులు

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని ముకునూరుపాలెం గ్రామంలో పేద విద్యార్థులకు హోప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం హోప్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి మణి కుమార్ చేతుల మీదుగా 50మంది విద్యార్థులకు బియ్యం, కందిపప్పు, చక్కెర తదితర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో యోహన్, యాషెన్, విజయ్ కుమార్, యాలం శాంతి, పాలం నాగమ్మ తదితరులు ఉన్నారు.

వెంకటరమణను చైర్మన్‌గా నియమించాలి

● విజయగిరి సమ్మయ్య


సమావేశంలో మాట్లాడుతున్న సమ్మయ్య

మల్హర్: కాళేశ్వర దేవస్థాన ఆలయ చైర్మన్‌గా బీసీ వర్గానికి చెందిన భాస్కర వెంకటరమణకు అవకాశం ఇవ్వాలని జాతీయ బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి సమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమ్మయ్య మాట్లాడారు. మహదేవపూర్ మండలానికి చెందిన భాస్కర వెంకట రమణ, రమణ తండ్రి కృష్ణమూర్తి కాంగ్రెస్ పార్టీకి నిత్యం సేవలు చేశారని తెలిపారు. రమణ యూత్ నాయకుడిగా కాంగ్రెస్ ఎన్‌ఎస్‌యూఐలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. పార్టీకి అంకిత భావంతో నిజాయితీ గల కార్యకర్తగా పని చేశారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గానికి చెందిన రమణకే ఆలయ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


రేగొండ (కొత్తపల్లిగోరి): అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ ప్రియాంక


భూపాలపల్లి రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు మహిళలు, చిన్నారులు

రేగొండ (కొత్తపల్లిగోరి): పోషక విలువలు గల చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థాలను గర్భిణులు తీసుకుంటే పుట్టబోయేబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్ ప్రియాంక అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలతోపాటు, పోషకాహార పదార్థాలను ప్రదర్శించి, అవగాహన కల్పించారు. అనంతరం ప్రియాంక మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో తయారు చేసే వంటకాలు తినడం అలవాటు చేసుకోవాలని, స్థానికంగా లభించే తాజా కూరగాయలు, ఆకుకూరల్లో సైతం అనేక పోషకాలుంటాయని వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని రాంనాయక్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత హాజరై ఆహారం, అలవాట్లు, చిరుధాన్యాల ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులకు రక్త పరీక్షలు చేయించి రక్తహీనతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ టీచర్లు, మహిళలు, ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు ఉపేందర్, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ లలిత, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అందని న్యూట్రిషన్ కిట్లు

మహదేవపూర్: గతంలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందించగా.. ప్రస్తుతం ఆ కిట్లు అందడంలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ న్యూట్రిషన్ కిట్టు ద్వారా గర్భిణులకు వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కర్జూరపండ్లు, నెయ్యి, మదర్ హార్లిక్స్ రెండు ఐరన్ సిరప్‌లు, పల్లిపట్టీలు, ఆల్‌బెండజోల్ ట్యాబ్లెట్లు అందించేవారు. గర్భందాల్చిన మూడో నెలనుంచి 7నెలల వరకు ఒకసారి.. 7వ నెల నుంచి 9నెలల వరకు రెండో సారి ఈన్యూట్రిషన్ కిట్ల పంపిణీ జరిగేది. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ పథకమైన న్యూట్రిషన్ కిట్టును ఎన్నికల సంఘం నిలిపివేసింది. అప్పటి నుంచి గత ఆరునెలలుగా కిట్టు పంపిణీ లేకుండా పోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందించాలని పలువురు కోరుతున్నారు.

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న జల్లారపు మల్లిక

పలిమెల : మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జల్లారపు మల్లిక అన్నారు. లోడీ సాంఘిక సేవా సంస్థ అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని లోడీ సేవా సంస్థ ప్రతినిధులు, స్థానిక మహిళలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించుకొని, వాటి పరిష్కారాలను అన్వేషించారు. ఈ సందర్భంగా జల్లారపు మల్లిక మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించి ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నాయన్నారు. మహిళలు వాటిని వినియోగించుకొని అన్ని రంగాల్లో ముందుంజలో ఉండాలన్నారు. ప్రతి ఆడపిల్లకు చదువుతోనే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని తెలిపారు. మహిళలు చట్టాలు, హక్కుల పై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మథర్ థెరిస్సా బ్యాంక్ మేనేజర్ మేకల మల్లేశం, నామని సుగుణ, వేల్పుల సరోజన, వెంకటస్వామి, స్వరూప, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్ నియామకంపై హర్షం


శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మల్హర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డిని రాష్ట్ర ట్రేడర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై వల్లెకుంట రెడ్డిగాండ్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మండలంలోని వల్లెకుంటలో మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొమ్మ తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు కుంభం బాపురెడ్డి. ప్రధాన కార్యదర్శి సంతోషం శ్రీనివాస్, కోశాధికారి అయిత స్వామిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు అయిత రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర్ గడ్డకు చెందిన కాలినేని రమేష్ రెండురోజుల క్రితం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి పట్టణానికి చెందిన హెచ్‌ఎంఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు కంకల రజిత–రాజయ్య బియ్యం, పప్పులు, నిత్యావసర సరుకులు, దుస్తులతోపాటు ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. స్థానిక చర్చి ఫాస్టర్లు రత్నం, సుమన్ మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోవడంతో మృతుడి భార్య, ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారని, నిరుపేద కుటుంబానికి ప్రజలు సహకారాన్ని అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటా..


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ: కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన యూత్ నాయకులకు ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్త, పాత భేదం లేకుండా ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సయ్య, ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, జిల్లా నాయకులు ఉమేష్ గౌడ్, కిష్టయ్య, పున్నం రవి, మైస భిక్షపతి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆటస్థలం ఆక్రమణ


సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

ములుగు రూరల్: మండలంలోని జీవింతరావుపల్లిలో గ్రామస్తులు బతుకమ్మ ఆడుకునేందుకు ఉన్న ఖాళీ స్థలాన్ని గ్రామానికి చెందిన ఓ కుటుంబం ఆక్రమించుకున్నారని గ్రామ పెద్దలు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం పలువురు గ్రామస్తులు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని బొల్లంకుంట సమీపంలోని భూమిలో గ్రామస్తులు హనుమాన్ ఆలయం నిర్మించుకున్నారు. ఆలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పంచాయతీ తీర్మానం మేరకు భూమిని చదును చేసి బతుకమ్మ ఆట స్థలంగా ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఒక కుటుంబం బతుకమ్మ స్థలాన్ని అక్రమించుకొని చుట్టు ప్రహరీ నిర్మాణం చేస్తున్న క్రమంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలను తొలగించి భూమిని పంచాయతీకి అప్పగించారని కోరినట్లు తెలిపారు. సదరు వ్యక్తి తిరిగి భూమిని అక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టగా మండల పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశామని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణకు గురైన భూమిని పంచాయతీకి అప్పగించాలని కోరారు. ఆలయ ప్రహరీ నిర్మాణం, మాలధారణ స్వాములకు షెడ్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొండ బోయిన శంకర్, దేవిసింగ్, అంగోత్ వంశీ, జంపు, శ్రీధర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై సమావేశం



మంగపేట: మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై గోదరి రవికుమార్ బుధవారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల నియమాలను వివరించారు. ఈనెల 16నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్ నియమాలను తప్పక పాటిస్తూ.. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, బీజేపీ అధ్యక్షుడు పూజారి సతీష్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదు

● జెడ్పీటీసీ గొర్రె సాగర్


సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

చిట్యాల: రాజకీయ లబ్ధికోసం అవాస్తవాలను సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సరికాదని జెడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని చైన్‌పాక గ్రామంలో డబుల్ బెడ్ రూం లబ్ధిదారుల సమక్షంలో ఆయన మాట్లాడారు. చైన్‌పాక గ్రామంలో 20మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు గత ప్రభుత్వంలో మంజూరయ్యాయి. దీంతో అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లకు శ్రీకారం చుట్టి కాంట్రాక్టర్‌కు అప్పగించి, సామగ్రిని సమకూర్చినట్లు పేర్కొన్నారు. కాగా, గ్రామస్తుల కోరిక మేరకు నాటి అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి హయాంలో మంజూరైన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు గండ్ర వెంకటరమణారెడ్డి కాలంలో గృహనిర్మాణ ఖర్చు పెరిగినందున రూ.లక్ష అదనంగా చెల్లిస్తే నిర్మిస్తానని కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. కానీ, కొంతమంది రాజకీయ లబ్ధికోసం రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నాపై బురద చల్లే విధంగా రాజకీయం చేయడం సరికాదన్నారు. అలాగే ఇళ్లు మంజూరులో లేవని, అక్రమంగా డబ్బులు వసూలు చేశారని వచ్చిన ఆరోపణలు అవాస్తవని అన్నారు. ఏమి తెలియని అమాయక ప్రజలను నాపైన ఉసిగొలిపి అవాస్తవలను సోషల్‌మీడియాలో ప్రచారం చేయొద్దని హితవుపలికారు. పరువు నష్టం కింద ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, అందుకుతండా, జూకల్ ఎంపీటీసీలు భూక్య సుజాత రాజు నాయక్, జంబుల తిరుపతి, మండల నాయకులు కూర మహిపాల్‌రెడ్డి, కర్రె అశోక్ రెడ్డి, పుట్టపాక మహేందర్, పువ్వాటి వెంకన్న, పిట్ట సురేష్, లావుడ్య రాజు నాయక్, బానోత్ శ్రీనివాస్ నాయక్, మోహన్, కాసర్ల దేవేందర్, దాసరి తిరుపతి, బోగం అశోక్, పల్లె శశిదర్‌రెడ్డి, దామెర రాజు, రాజు నాయక్, రాకేష్, వినోద్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

అపరిచితులకు సహకరించొద్దు


గోవిందరావుపేట: పందిరిదోన గొత్తికోయ గ్రామాన్ని సందర్శించిన సీఐ, ఎస్సై

గోవిందరావుపేట: అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గొత్తికోయలు గ్రామాల్లో తిరిగే అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని పస్రా సీఐ శంకర్, ఎస్సై అచ్చ కమలాకర్ సూచించారు. పస్రా పరిధిలోని పందిరిదోన గొత్తికోయ గ్రామాన్ని వారు బుధవారం సందర్శించి, మాట్లాడారు. మావోయిస్టులకు ఎలాంటి సహాయ, సహకారాలు అందించకూడదని, అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని తెలిపారు. ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామానికి వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

వాహనాల తనిఖీ

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్ – బయ్యక్కపేట వెళ్లే రోడ్డు మార్గంలో వచ్చిపోయే వాహనాలను తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. వాహనాలు తనిఖీ చేసి అనుమానితులను విచారించి వదిలేశారు. వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లైసెన్స్ పత్రాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని వాహనదారులకు సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలో భాగంగా మారుమూల ప్రాంతాల్లో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిసింది.



ఎస్ఎస్ తాడ్వాయి: వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు


గుడుంబా స్థావరాలపై దాడి చేస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామ సమీపంలోని గోదావరి పరివాహక ప్రాంతంలోని వ్యవసాయ భూములలో గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వెంకటాపురం ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. బెస్తగూడెం గ్రామ శివారుల్లోని గోదావరి సమీపంలోని మిర్చి తోటల సమీపంలో గుడుంబా తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 1,600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 18లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా, బెస్తగూడెం గ్రామానికి చెందిన రాజు గుడుంబా క్యాన్‌తో పారిపోతుండగా పట్టుకొని నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైన గుడుంబా తయారు చేసినా... విక్రయించినా.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా విక్రయిస్తున్నట్లు తయారు చేస్తున్నట్లు ఎవరికైన తెలసిన తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

● నిర్భయంగా సమాచారం ఇవ్వండి
● ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని పలు గ్రామాల్లో నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. పోలీసులంటే భయం లేకుండా ఫోన్ ద్వారా సమస్యలు, నేరాలను దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళిక

గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలను సంప్రదించి, సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలతో దొంగతనాలు, అనుమానిత వ్యక్తుల సంచారం తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తొలుత ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, మిగతా గ్రామాల ప్రజలకు కూడా అవగాహన కలిగేలా చర్యలు చేపడతామన్నారు. గ్రామాల వారీగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి అందులో స్థానికులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువతను భాగస్వాములను చేస్తామన్నారు. గుడుంబా నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, యువత గంజాయి బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మేడారం జాతరలో జిల్లా ఉన్నతాధికారులు నుంచి కిందిస్థాయి సిబ్బంది సహాయ సహకారాలతో జాతర విజయవంతానికి కృషి చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్లేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

శిఖర సుదర్శన చక్రం ప్రతిష్ఠకు సిద్ధం

● సీతారామచంద్రస్వామి ఆలయం ముస్తాబు


ఆలయంలో ప్రతిష్టించిన కృష్ణుడి విగ్రహం


ముస్తాబైన రామాలయం

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయ శిఖర సుదర్శన చక్రం పునఃప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి ఆలయం ముస్తాబైంది. నేడు(గురువారం) సాయంత్రం మంగళవాయిద్యాలు, స్వస్తి వాచనము, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్ష ధారణ, అఖండ స్థాపన, యోగిని, వాస్తు, క్షేత్రపాలకం నిర్వహించనున్నారు. సుదర్శన చక్రానికి రాత్రి 7గంటలకు జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, ఫలాధివాసం జరిపిస్తామని అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్ రావుశర్మ తెలిపారు. రాత్రి 8 గంటలకు నీరాజనం, మంత్ర పుష్పాలు, చతుర్వేద స్వస్తి, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. అలాగే శుక్రవారం ఉదయం మంగళవాయిద్యాలు, గురు ప్రార్థన, చతుస్థాన మండపార్చన, అగ్ని ప్రతిష్టాపన, మూల మంత్ర దేవతా హోమాలు కళాన్యాస హోమాలుంటాయన్నారు. 9 గంటలకు గర్తన్యాసం, బీజన్యాసం, ధాతున్యాసం, 10.02 నిమిషాలకు శిఖర ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయం ఆవరణలో నూతనంగా శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహం చుట్టూ తులసి వనాన్ని ఏర్పాటు చేయనున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి

ములుగు రూరల్: బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం, పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు విటమిన్, మిల్లెట్స్‌తో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, లక్ష్మీకాంత, సుభద్ర, సఖీ కేంద్రం సిబ్బంది మౌనిక తదితరులు పాల్గొన్నారు.